క్లుప్తంగా

ప్రసన్నాంజనేయుడికి విశిష్ట పూజలు


ఆంజనేయుడికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు

బల్లికురవ: ఆషాడ మాసం శుక్రపాడ్యమి ముగింపు విదియ, ఆదివారం సందర్భంగా బల్లికురవ గ్రామంలోని ప్రజన్నాంజనేయుడికి విశిష్ట పూజలు చేపట్టారు. అర్చకులు ఐనవోలు శివశాయి కృష్ణచైె స్వామివారికి క్షీరాభిషేకం తమలపాకులతో అర్చన, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. గ్రామం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ఆలయంలోని సీతారామలక్ష్మణ సమేత కోదండరాముడికి ప్రత్యేక పూజలు చేపట్టారు.

శింగరకొండ దర్శిని


ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, ఆషాఢ మాసం, ఆశ్లేష నక్షత్రం, తదియ తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

ధారావారితోటలో చోరీ

ఒంగోలు సెంట్రల్: నగరంలోని ధారావారితోటలో ఓ మహిళ నివాసంలో దొంగలు పడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. నెల్లూరుకు చెందిన మహిళ పింగిలి నిర్మల బస్టాండ్ సమీపంలోని టిఫిన్ సెంటర్‌లో పనిచేస్తూ జీవిస్తోంది. ధారావారితోటలో నివాసం ఉంటోంది. ఈ నెల 4న తన స్వగ్రామం నెల్లూరు వెళ్లింది. తిరిగి 6వ తేదీ ఇంటికి రాగా, తాళం పగులకొట్టి ఉంది. నివాసంలోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. తన నివాసంలో దొంగలు పడినట్లు గుర్తించి స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తాను దాచుకున్న వెండిపట్టీలు, బంగారు కమ్మలు, రూ.2 వేల నగదు పోయినట్లు గుర్తించి ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపింది. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.


నిరుపయోగంగా ఉన్న రైల్వే ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు


రెండో నంబరు ప్లాట్ ఫాం నుంచి పట్టాలపై నుంచి పట్టాలు దాటుతూ 1వ నంబర్ ప్లాట్‌ఫాంకు చేరుకుంటున్న ప్రయాణికులు


నాలుగో ప్లాట్‌ఫాం నుంచి పట్టాలు దాటుతూ మూడో ప్లాట్‌ఫాంపైకి వస్తున్న ప్రయాణికులు

ఖర్చు కోట్లు .. సౌకర్యాలు సున్నా

- నిరుపయోగంగా రెండు ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు
- టికెట్ కౌంటర్ నుంచి 200 మీటర్ల దూరంలో బ్రిడ్జిలు
- ప్రమాదమని తెలిసినా పట్టాలపై దాటుతున్న ప్రయాణికులు
- నిద్రపోతున్న రైల్వే అధికారులు

వేటపాలెం: నిధులు నీళ్లలా ఖర్చు చేశారు కాని వసతులు మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. కేవలం పని చేశాం చూడండి అంటూ చేతులు దులుపుకున్నారు అధికారులు. ఫలితంగా ప్రయాణికులు, సామాన్య జనం ఇక్కట్ల పాలవుతున్నారు. వేటపాలెం రైల్వే స్టేషన్ అభివృద్ధికి రైల్వే శాఖ రూ.కోట్లు నిధులు ఖర్చుచేశారు. అయితే ప్రయాణికులకు మాత్రం ఎటువంటి ఉపయోగం లేకుండా పోయాయి. రైల్వే స్టేషన్‌కి ఆదాయ రూపంలో మాత్రం భారీగానే సమకూరుతుంది. ప్రయాణికుల రూపేణా కాకుండా, జీడిపప్పు ఎగుమతులు దిగుమతులుల రూపేణా ఆదాయం సమకూరుతుంది. అయితే రైల్వే అధికారులు ప్రయాణికుల సౌకర్యాలను మాత్రం పట్టించుకోవడం లేదు. వందల పర్యాయాలు ఆశాఖ ఉన్నతాధికారులకు ప్రయాణికుల సౌకర్యాలపై వినతి పత్రాలు అందజేశారు. అయితే అవి బుట్టదాఖలయ్యాయి.

హంగు, ఆర్భాటాలకే ప్రాధాన్యం..

విజయవాడ-గూడూరు మధ్యన మూడో లైన్ నిర్మాణంలో భాగంగా పాతస్టేషన్ భవనాన్ని కూల్చివేసి నూతనంగా రూ. 2 కోట్లు నిధులు ఖర్చు చేసి రెండంతస్తుల నూతన భవనం నిర్మించారు. గతంలో రెండు మెయిన్ లైన్‌లు ఉండగా మూడో మెయిన్‌లైన్‌తో పాటు మరో లూప్ లైన్ నిర్మాణం చేశారు. గతంలో మూడు ప్లాట్‌ఫాంలు ఉండగా ప్రస్తుతం ఆధునికీకరణలో భాగంగా మరో రెండు అదనంగా పెంచి ప్రస్తుతం ఐదు ప్లాట్‌ఫాంలు ఏర్పాటు చేశారు. ఇదంతా బాగానే ఉంది కాని ప్రయాణికులకు కావాల్సిన సౌకర్యాలు మాత్రం మరచిపోయారు.

దిష్టిబొమ్మలా ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు..

స్టేషన్‌లో ప్లాట్‌ఫాంలపై రైలు దిగిన ప్రయాణికులు బయటకు వెళ్లడానికి ఏర్పాటు చేసిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిరుపయోగంగా ఉండిపోయింది. దీంతో పాటు ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం నుంచి రెండో నంబర్ ప్లాట్‌ఫాం వరకు వెళ్లడానికి నూతనంగా రూ.1 కోటితో నిర్మించిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జి దిష్టిబొమ్మలా కనపడుతోంది. అంతేకాకుండా స్టేషన్ దక్షిణం వైపు 4,5 ప్లాట్‌ఫాంలు దాటడానికి ఉన్న పాత ఫుట్ ఓవర్ బ్రిడ్జి కూడా ఏమాత్రం ఉపయోగంలో లేదు. స్టేషన్ మధ్యలో లేదా ఉత్తరం వైపు రైలు దిగిన ప్రయాణికులు ప్లాట్‌ఫాం దక్షిణం పైపు చివరన ఏర్పాటు చేసిన ఓవర్ బిడ్జి దూరంగా ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో స్టేషన్ ముందుగుండా ప్రమాదం అని తెలిసినా నాలుగు వసరల పట్టాలు దాటుకుంటూ స్టేషన్ ప్రధాన ద్వారం వద్దకు చేరుకుంటున్నారు. ప్రయాణికులు ఫుట్ ఓవర్ బ్రిడ్జిని స్టేషన్ మధ్యలోకి మార్చాల్సిందిగా రైల్వే శాఖ ఉన్నత అధికారులకు వందల సంఖ్యలో విన్నపాలు చేసుకొన్నా ప్రయోజనం కనిపించలేదు. ప్రస్తుతం నూతనంగా నిర్మించిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి కూడా దక్షిణం వైపున గతంలో ఉన్న పాత దానికి అనుసంధానం చేశారు. రాజకీయ నాయకులు రైల్వే ఉన్నత అధికారులకు అనేక పర్యాయాలు విజ్ఞప్తులు పంపించినా ప్రయోజనం లేకుండా పోయింది. వృద్ధులు, పిల్లలు, వికలాంగులు ప్లాట్‌ఫాంలు దాటడానికి అవస్థలు పడుతున్నారు. స్టేషన్‌కి చివరగా ఏర్పాటు చేసి ఫుట్‌ఓవర్ బిడ్జిని రాత్రి వేళల్లో అకతాయలకు నిలయంగా మారింది.


వేటపాలెం రైల్వే స్టేషన్

> **ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు ప్రయాణికులకు ఏమాత్రం ఉపయోగంగా లేవు..**
>
> నేను ఒంగోలు రిమ్స్‌లో ఉద్యోగం చేస్తున్నాను. రోజు ఉదయం రైలులో ఒంగోలు వెళ్లి సాయంత్రం వేటపాలెం చేరుకుంటాను. అయితే 1 నంబరు నుంచి 4 నంబరు ప్లాట్ ఫాంకు వెళ్లడానికి పట్టాలు దాటుకుంటూ వెళ్లాలి. ప్లాట్ ఫాం దక్షిణ వైపు చివర్లో నిర్మించిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ఎందుకూ ఉపయోగపడటం లేదు. ప్రయాణికులు ప్రమాదమని తెలిసినా తప్పని పరిస్థితిలో పట్టాలు దాటి వెళ్తున్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిని స్టేషన్ మధ్యలో ఏర్పాటు చేయాలి.
>
> – మాథ్యూస్, ప్రయాణికుడు, వేటపాలెం

గణనీయంగా ఆదాయం..

వేటపాలెం రైల్వేస్టేషన్ ద్వారా రైల్వే శాఖకు గణనీయంగా ఆదాయం సమకూరుతోంది. ప్రయాణికుల ద్వారానే కాకుండా ఈ ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు జీడిపప్పు ఎగుమతులు ద్వారా లక్షల్లో ఆదాయం వస్తోంది. అదేస్థాయిలో ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ఆ శాఖాధికారులపైనా ఉంది. అయితే రైల్వే అధికారులు పెద్ద స్టేషన్లపైనే ఎక్కువగా దృష్టి సారిస్తున్నారు. చిన్న స్టేషన్‌లంటే వీరికి చిన్నచూపే. ఇప్పటికైనా రైల్వే ఉన్నత అధికారులు ప్రయాణికుల కోసం ప్లాట్‌ఫాం చివరగా ఉన్న ఫుట్‌ఓవర్ బిడ్జిని స్టేషన్ మధ్యలోకి మార్చుచేసి ప్రయాణికులకు ఉపయోగించుకోనే విధంగా చేయాలని కోరుతున్నారు.

వైఎస్సార్ జయంతి విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి చిన హనిమిరెడ్డి

- నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి హనిమిరెడ్డి

అద్దంకి రూరల్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను సోమవారం అద్దంకి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించాలని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి ఆదివారం తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ జయంతి సందర్భంగా నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఉన్న రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలను శుభ్రం చేసి అలంకరించి కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. సోమవారం ఉదయం 10 గంటలకు అద్దంకి పట్టణంలోని వైఎస్సార్ విగ్రహనికి పూలమాలు వేసి జయంతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం నియోజకవర్గంలో 5 మండలాల్లోని గ్రామాల్లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొనన్నున్నట్లు వివరించారు. అనంతరం పార్టీ కార్యకర్తలు, నాయకులతో మాట్లాడారు.

మార్టూరు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు మండలంలోని పలు గ్రామాలలో నిర్వహించనున్నట్లు మండల పార్టీ కన్వీనర్ పఠాన్ కాలేషావలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గల వైఎస్సార్ విగ్రహం వద్ద ఉదయం 9 గంటలకు వేడుకలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వలపర్ల గ్రామంలో సినిమా హాల్ సెంటర్ వైఎస్సార్ విగ్రహం వద్ద జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆపార్టీ నాయకులు తెలిపారు. గ్రామ పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

జే.పంగులూరు: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో నేడు ఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ స్వయంపు హనుమంతురావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం రేణింగవరం, అలవలపాడు, చందలూరు, కొండమంజులూరు గ్రామాల్లో జరగబోవు వైఎస్సార్ జయంతి వేడుకలకు అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ పానెం చిన హనిమిరెడ్డి పాల్గొంటారని తెలిపారు.

చీరాల: డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 10గంటలకు స్థానిక గడియార స్తంభం సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. కార్యక్రమానికి వివిధ హోదాలలో ఉన్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

కాంట్రాక్ట్ లెక్చరర్ల రెన్యువల్‌కు అవకాశం

చీరాల అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్ డిగ్రీ కాలేజీలలో 2023–24 విద్యాసంవత్సరంలో పనిచేసిన కాంట్రాక్ట్ అధ్యాపకులు 2024–25 సంవత్సరానికి రెన్యువల్ కోసం దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా ఐడీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.మురళి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తును ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్ల ద్వారా ఈనెల 9వ తేదీలోపు వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో సమర్పించాలన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ విజేతలకు నేడు అభినందన సభ

బల్లికురవ: ప్రభుత్వం నిర్వహించిన ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో బాపట్ల జిల్లా స్థాయిలో ప్రథమ ద్వితీయ స్థానాలతో పాటు అత్యధిక మార్కులు సాధించిన మరో 20 మందికి సోమవారం సాయంత్రం పాఠశాలలో అవార్డులతో సత్కరించరించనున్నట్లు కొప్పరపాడు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పీ. శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి డిప్యూటీ డీఈవో ఎం నిర్మలాదేవి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఎన్. కీర్తన , జీ. కోటేశ్వరరావు జిల్లాస్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు, అత్యధిక మార్కులు కైవసం చేసుకున్న విద్యార్థులు ఎల్ ఝాన్సీరాణి, సీహెచ్ కావ్యాంజలి, టి. హర్షవర్ధన్, కె. పూజిత, డి. మోక్షిత, ఎస్. రోహిత్ శాయి. పీ.అవినాష్, ఎ. పవన్ చరణ్ తల్లి దండ్రులతో హాజరుకావాలన్నారు. 4 సంవత్సరాలతోపాటు, ప్రతి సంవత్సరం రూ.12 వేల చొప్పున బ్యాంకు ఖాతాలకు జమ చేస్తారని, ఈసభలో పీఎంసీ కమిటీ గ్రామ పెద్దలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య నిందితులను కఠినంగా శిక్షించాలి

చీరాల రూరల్: తమిళనాడు రాష్ట్ర బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్‌ను అత్యంత పాశవికంగా హత్య చేసిన హంతకులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటి మార్క్, బాపట్ల పార్లమెంటరీ ఇన్‌చార్జి జగన్మోహనరావులు డిమాండ్ చేశారు. బహుజనుడైన ఆర్మ్‌స్ట్రాంగ్ చిన్నతనం నుంచి ఎంతో కష్టపడి ఉన్నత స్థానానికి చేరాడని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులను ఉచితంగా చదివించడమే కాక వారి ఉన్నతికి పాటుపడ్డారన్నారు. అంతేకాక ఎంతో మంది విద్యార్థులను న్యాయవాదులుగా తీర్చిదిద్దిన ఘనత ఆయనకు దక్కిందన్నారు. ఎవరికి హాని తలపెట్టని మహోన్నత వ్యక్తిని హత్య చేసిన నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని వారు కోరారు.

అక్షర తపస్వి రావూరి భరద్వాజ


రావూరి భరద్వాజ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న అతిథులు

చీరాల అర్బన్: కలాన్ని కన్నీళ్లతో నింపి సాహిత్య సారస్వతాన్ని సృజించిన అక్షర తపస్వి డాక్టర్ రావూరి భరద్వాజ నిరాడంబర జీవితం అందరికి ఆదర్శమని రావూరి భరద్వాజ సాహితీ సమితి అధ్యక్షులు, విశ్రాంత ప్రిన్సిపాల్ ఎ.నాగవీరభద్రాచారి అన్నారు. ఆదివారం చీరాలలోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ రావూరి భరద్వాజ 97వ జయంతి నిర్వహించారు. స్వీయ అనుభవాలను మేళవించి సజీవమైన రచనలు చేసిన భరద్వాజ జీవితం మహాగ్రంథమని అన్నారు. ఆయన రచించిన 'పాకుడురాళ్లు' నవలకు 2012లో భారత ప్రభుత్వం జ్ఞానపీఠ్ అవార్డు అందించిందన్నారు. కార్యక్రమంలో ఎస్ యల్లమందారెడ్డి, విశ్రాంత రీడర్ పి.శివాంజనేయప్రసాద్, కట్టా రాజ్ వినయ్‌కుమార్, సెక్రటరీ రామారావు, కోశాధికారి దశరధరామయ్య, కొల్లూరి ప్రసాద్, పూరా మస్తాన్‌రావు, వెల్లంకి కృష్ణమూర్తి, మునిరుల్లాఖాన్, ఊటుకూరి జగన్మోహనరావు, ఎం.రామారావు, మణి, రిటైర్డు తహశీల్దార్ ఎం.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటో, కారు ఢీ–ఇద్దరికి గాయాలు


తిరగబడిన ఆటో వద్ద క్షతగాత్రులు

అద్దంకి: ఆటోను కారు ఢీకొట్టుకున్న ఘటనలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈఘటన మండలంలోని తిమ్మాయపాలెం గ్రామ సమీపంలో ఆదివారం జరిగింది. అందిన సమాచారం మేరకు దర్శి మడలంలోని గొర్లమడుగు గ్రామం నుంచి సుబ్బారెడ్డి పనిమీద అద్దంకి వెళ్తున్నాడు. ఈ క్రమంలో కంభం నుంచి దర్శి వెళ్తున్న కారు ఢీకొట్టుకోవడంతో ఆటో సైడులోకి దూసుకెళ్లి తిరగబడింది. ఆటోలో ప్రయాణిస్తున్న సుబ్బారెడ్డితో పాటు మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు క్షతగాత్రులను అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

గ్రామ దేవతలకు మొక్కులు


పోలేరమ్మ ఆలయం వద్ద పొంగళ్లు పెడుతున్న భక్తులు


అలంకరణలో అమ్మవారు

బల్లికురవ: ఆషాఢమాసం ఆదివారం సందర్భంగా మండలంలోని గ్రామ దేవతలకు పూజలు చేపట్టి తమతమ మొక్కులు చెల్లించుకున్నారు. కొండయపాలెం గ్రామంలోని పోలేరమ్మ ఆలయంలో పొంగళ్లపెట్టి అమ్మవారికి నివేదించారు. నక్కబొక్కలపాడు గ్రామ సమీపంలోని ఈర్లగంగమ్మ సన్నిధానానికి గ్రామంతోపాటు వివిధ గ్రామాలకు చెందిన భక్తులు భారీగా తరలివచ్చారు. పొంగళ్ల పెట్టి నివేదించారు. బల్లికురవ, గుంటుపల్లి, పెదఅంబడిపూడి, చినఅంబడిపూడి, వల్లాపల్లి, చెన్నుపల్లి కొణిదెన గ్రామాల్లో గ్రామ దేవతలకు ప్రత్యేకపూజలు చేపట్టారు. వర్షాలు కురిసి పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవార్లను ప్రార్థించారు.

రైతు అనుమతి లేకుండా కౌలు కార్డులు ఇవ్వాలి


గ్రామంలో సమావేశమైన కౌలు రైతులు

కారంచేడు: రైతు అనుమతి లేకపోయినా కౌలు రైతుకు కౌలు కార్డులు ఇవ్వాలని కౌలు రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కౌలు రైతుకు కౌలు కార్డులు ఇవ్వాలని స్వర్ణ గ్రామంలో ప్రచార నిర్వహించారు. ఈసందర్భంగా కౌలు రైతులు మాట్లాడుతూ గ్రామాలలో 80 శాతానికి పైగా భూమిని కౌలు రైతులు సాగు చేస్తున్నారన్నారు. ఆరుగాలం కష్టపడి పనిచేసిన రైతు కుటుంబానికి ఏమీ మిగలడం లేదని, భూమిపై రైతులకు ఇచ్చే అన్ని రాయితీలు వాస్తవ భూమి హక్కు దారైన రైతుకు అందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భూమిపై కష్టపడి పనిచేస్తున్న కౌలు రైతు కుటుంబానికి బ్యాంకు రుణం, ప్రభుత్వ ఆర్థిక సాయం, ఇచ్చే సబ్సిడీలు గానీ కౌలుదారుడికి దక్కడం లేదన్నారు. అందువల్ల కౌలు రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు రోజు పత్రికల్లో వస్తున్నాయని చెప్పారు. కౌలు దారునికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఇందుకోసం జూలై 11న కారంచేడు ఎమ్మార్వో, వ్యవసాయ అధికారులకు వినతి పత్రాలు ఇవ్వడానికి కౌలు రైతులందరూ తరలిరావాలని కౌలు రైతు సంఘం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో వీధి వీధినా ప్రచార నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ కౌలు రైతు సంఘం నాయకులు పి ఏడుకొండలు, హనుమంతరావు, శ్రీనివాసరావు, సుబ్బారావు, జిల్లా నాయకులు ఏం బాబు రావు, పి కొండయ్య పాల్గొన్నారు.

గ్రామ సింహాల దెబ్బకు జనం హడల్


ఈపురుపాలెంలో తిరుగుతున్న శునకాలు


తోటవారిపాలెంలో శునకాల గుంపు

చీరాల టౌన్: మండలంలోని రూరల్ గ్రామ పంచాయతీల్లో శునకాలు హల్‌చల్ చేస్తున్నాయి. గ్రామంలోని ప్రధాన వీధులతో పాటుగా అంతర్గత రహదారుల్లో సైతం శునకాలు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. ఈపురుపాలెం గ్రామంలోని పద్మనాభునిపేట, నలబై ఇండ్ల కాలనీ, పురుగుల పేట, గాంధీపార్కు సెంటర్, ఆదినారాయణపురం, పాత మునుసుబుగారి వీధి తదితర ప్రాంతాలతో పాటుగా తోటవారిపాలెంలోని వీవర్స్‌కాలనీ, పాత హరిజనవాడ తదితర పారతాల్లో శునకాలు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను కరుస్తున్నాయి. ఈపురుపాలెం నుంచి చీరాల వైపువెళ్లే ప్రధాన రహదారిపై వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. నడిచివెళ్తున్న, ద్విచక్రవాహనాలపై వెళ్తున్న ప్రజలపై శునకాలు దాడులకు పాల్పడుతుండటంతో గ్రామస్తులు భయాందోళనలు చెందుతున్నారు. వీధుల్లో గుంపులు గుంపులుగా శునకాలు సంచరిస్తు ప్రజలను కరుస్తున్నా కానీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. అధికారులు అలసత్వాన్ని వీడి గ్రామాల్లో విచ్చలవిడిగా తిరుగుతున్న శునకాలను ఊరి నుంచి పంపించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కార్పొరేట్‌కు దీటుగా విద్యనందించాలి


ఎస్టీయూ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

చీరాల: కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన సాగించాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. చీరాల రోటరీ భవనంలో ఆదివారం రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో విద్యా సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. ముఖ్యంగా విద్యారంగంలో పెనుమార్పులు తీసుకొచ్చి ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో అన్ని మౌలిక వసతులను కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు సాయి శ్రీనివాస్, ఎంఈఓ సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని ఎస్‌వీఆర్ అండ్ ఎస్‌జేఆర్ కళ్యాణ మండపంలో ఆదివారం మహాత్మాగాంధీ వెల్ఫేర్ సొసైటీ 18వ వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. అనంతరం గుమస్తాలకు ఋణాలపై వస్తువులు, వారి పిల్లలకు ఫీజుల నిమిత్తం నగదు, ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహాత్మా గాంధీ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.